

# అద్వైతం

## – శారద (బ్రిస్బేన్)

### (క్రిందటి సంచిక నుంచీ కొనసాగింపు)

***1994– డిసెంబర్***

అమ్మాయిలు నలుగురూ, ఆశా, కోమలీ, సూసీ, భానూ హిమాయత్నగర్ బ్లూ ఫాక్స్ రెస్టారెంట్‌లో లంచ్ కని కలిసారు.

"మీకందరికీ ఒక విషయం చెప్పాలి," కోమలి, వెయిటర్ ఆర్డర్ తీసుకొని వెళ్ళగానే చెప్పింది.

"చెప్పు, చెప్పు! ఏదైనా గుడ్ న్యూసా?"

“గుడ్ న్యూసా, అంటే అలాటిదే అనుకుంటున్నాను. నేను అమెరికా వెళ్తున్నాను. యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో అడ్మిషన్ వచ్చింది."

"మీరంతా ఇలా పెళ్ళిళ్ళు చెసుకొనీ, అమెరికాలకి వెళ్తూ నా ప్రాణం మీదికి తెస్తున్నారే!" కొపంగా అంది భాను.

"ఎందుకు? ఇప్పుడు నీకేమైంది?" ఆశ్చర్యంగా అంది ఆశా.

"ఎవరికి పెళ్ళైనా, ఎవరు అమెరికా వెళ్ళినా, మా ప్రశ్నల ప్రభావతి, పద్మనాభమూ, నన్నో రేంజీలో ఆడుకుంటారు. నేను ఏ ఎదుగూ బొదుగూ లేని ఉద్యోగంలో చేరాననీ, నాకసలు కేరీర్ మీద శ్రద్ధే లేదనీ ఏదేదో సోది మొదలు పెడతారే. చేరిన ఆరునెలల్లోనే ఉద్యోగాల్లో ప్రమోషన్లొస్తాయా, అంటే వినరు."

"పోనీ, వాళ్ళ మాట విని సంబంధాలు చూడడానికి ఒప్పుకోవచ్చుకదే?" కొంటెగా నవ్వుతూ అంది కోమలి.

"ఏ సంబంధాలూ చూడాల్సిన పని లేదులే!" విసుగ్గా అంది భాను.

"వాట్? చెప్పు, చెప్పు, సంబంధం కుదిరిపోయిందా?" సూసీ ఆత్రంగా అడిగింది.

"అబ్బ, సూసీ, నువ్వు మరీ ఇంత డల్ అనుకోలేదే! నిజంగా, భాను గురించి నీకేమి తెలియదా?" చిరాగ్గా అడిగింది ఆశ.

"ఎందుకు తెలియదమ్మా? అందరికీ తెలుసు. కానీ, దాని నోటి వెంటే రానీ!"

"అబ్బ, ఇంక చాలే! ఓకే, నేనూ అశోక్ పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాం. ఇంకా మా ఇళ్ళల్లో చెప్పలేదనుకో. అయితే పెళ్ళి ఇప్పట్లో కాదు. అశోక్ పీహెచ్‌డీ పని ఒక కొలిక్కి వచ్చాక కానీ పెళ్ళి వొద్దనుకుంటున్నాడు. ఈలోగా నేనూ కూడా కెరీర్లో కొంచెం కుదురుకోవచ్చు కదా? అయితే మా ఇద్దరి కులాలు ఒకటి కాదు. మా ఇంట్లో చచ్చినా ఒప్పుకోరు. నాకు చాలా భయంగా వుంది. సంతోషంగా కూడా వుందనుకో!" గబగబా చెప్పి భాను ఊపిరి పీల్చుకుంది. సూసీ భాను చేయి మీద తట్టింది.

"డోంట్ వరీ భాను. పేరెంట్స్ ముందు కొంచెం గొడవ పెట్టినా, తొందర్లోనే సర్దుకుంటారు. ఎవ్విరీ థింగ్ విల్ బీ ఫైన్!"

"అది సరే, సినిమాకి టైమవుతుంది. పదండి, పదండి," అందరి మూడ్ మళ్ళిస్తూ అంది ఆశా.

"ఇది పెళ్ళైనా ఏమీ మారలేదే. ఇప్పుడా హం ఆప్కే హై కౌన్ సినిమా చూసి తీరాల్సిందేనా? ఇంతకు ముందొకసారి వెళ్ళి హాల్లోనే నిద్రపోయాను, అంత బోరు కొట్టింది!" కోమలి కాఫీ బిల్లు చెల్లిస్తూ అంది. అందరూ నవ్వుతూ లేచి బయటికి నడిచారు.

★★★★★★★★★★★★★

***1996– డిసెంబర్***

హాలంతా రంగు రంగుల బల్బులతో అలంకరించి వుంది. బంధువులూ, స్నేహితులూ కబుర్లు చెప్పుకుంటూ హడావిడి చేస్తున్నారు. వేదిక పైన అలసిపోయినా, నవ్వు మొహాలతో నిబడి వున్నారు అశోక్, భాను.

"మొత్తానికి అనుకున్నది సాధించావు మిసెస్ అశోక్!"

భాను అశోక్ మొహంలోకి చూసి నవ్వింది.

"థాంక్ యూ! థాంక్ యూ! మీరు అందించిన సహకారం వల్లే అది సాధ్యమైంది మిస్టర్ అశోక్! అన్నట్టు, మా అమ్మ హడావిడి చూడు! ఈ పెళ్ళి తనకిష్టంలేదని ఎంత సణిగింది అమ్మ! ఇప్పుడిక్కడ హడావిడంతా అమ్మదే!"

"అమ్మలంతా అంతే భానూ. మా అమ్మ మాత్రం చాలా సంతోషంగా వుంది."

"పొద్దున్న రిజిస్ట్రార్ ఆఫీసులోకూడా, ఆంటీ నన్ను హగ్ చేసుకున్నారు."

"అంతంత వాదనల తరవాత మన వాళ్ళంతా రిజిస్టర్ మేరేజ్‌కి ఒప్పుకున్నారు! నాకైంతే అదే చాలు."

"అవునులే! అందుకేకదా ఈ రిసెప్షన్! అవునూ, మీ కాలేజీ స్టాఫ్ అంతా వొచ్చారా?"

"అందరూ వచ్చారు. మీ ఆఫీసు కొలీగ్సూ, మా ఫామిలీ ఫ్రెండ్సూ, మనచుట్టాలూ అంతా కలిసి బోలెడంత మంది! పెళ్ళంటే ఇంత జనమా?"

"ఇంతమంది తిన్నాకనే మనకి తిండి పెడతారా? నాకు బాగా ఆకలిగా వుంది అశోక్!"

"అవునా? ఆగు,అమ్మాని పిలిచి నీకొక ఐస్‌క్రీం తెమ్మననా?"

ఆ రోజు ఉదయం పది గంటలకి వాళ్ళిద్దరి పెళ్ళి స్నేహితులూ, కుటుంబ సభ్యుల మధ్య నిరాడంబరంగా జరిగిపోయింది. ఎన్నెన్నో కారణాల వల్ల వొద్దని వారించిన పెద్దలు కూడా పెద్ద మనసు చేసుకొని దీవించారు.

అంత డబ్బున్న కుటుంబం నుంచి వొచ్చిన అమ్మాయి తమతో ఎలా అడ్జస్ట్ అవుతుందోనని సుమిత్ర భయపడింది కానీ, దాన్ని పెద్దగా ప్రకటించలేదు. పద్మనాభం ఏమీ తేలకపోయినా, కూతురికి తగిన సంబంధం కాదని అనుకున్నాడు. ప్రభావతికి అశోక్ చాలా నచ్చినా, యే పెద్ద డాక్టరో, ఇంజినీరో, బాంక్ ఆఫీసరో, అయ్యేయెస్ ఆఫీసరో, అమెరికాలో పెద్ద ఉద్యోగం చేస్తూ వున్న అబ్బాయినో పెళ్ళాడాల్సిన తన కూతురు ఒక చిన్న లెక్చరర్ని పెళ్ళి చేసుకుంటాననడం ఏమాత్రం నచ్చలేదు. అయినా, మనసు సరిపెట్టుకొని, "మా అల్లుడు, డాక్టర్ అశోక్", అని అందరికీ చెప్పుకుంది. యే డాక్టరో వివరించదల్చుకోలేదు కానీ.

"అది సరే, ఇంకా చదువు కూడా పూర్తికాని పెళ్ళికొడుకుని చేసుకుంటున్నావు. మీ బంధువులేమీ అనలేదా?"

"ఏమో, అందరికీ మా అమ్మ మాత్రం నువ్వు డాక్టరని చెప్పేసుకుంది. అయినా నీ పీహెచ్‌డీ అయిపోయినట్టే కదా?"

"అవును, థీసిస్ సబ్మిట్ చేసి ఒక పబ్లిక్ డిఫెన్స్ చేయాలి. అంతే, ఆగస్టులో గ్రాడ్యుయేషన్."

"హలో లవ్ బర్డ్స్," ఆశా, శరత్ వేదిక మీదికొచ్చారు. సంతోషంగా భానుని హత్తుకుంది ఆశా.

"కోమలీ, సూసీ ఇద్దరూ రాలేకపోయారు. కనీసం నువ్వైనా వొచ్చావు," నవ్వుతూ అంది భాను.

"పద పద శరత్. ఆకలిగా వుంది భానూ. డిన్నర్ తిని మళ్ళీ మాట్లాడతా. ఆల్ ది బెస్ట్." ఆశా, శరత్‌ని తీసుకుని వెళ్ళిపోయింది.

"భానూ, అశోక్, రండి, ఇద్దరూ భోంచేద్దురు కాని," సుమిత్ర ఇద్దరినీ తీసికెళ్ళింది.

★★★★★★★★★★★★★★★★★★

"ఏమిటీ? ఇల్లు మారతున్నావా? ఎక్కడికీ?"

"అవునమ్మా !కుకట్‌పల్లి దగ్గర, ఫోర్ బెడ్‌రూం ఫ్లాట్ అద్దెకు తీసుకుందామని అనుకుంటున్నాం. మలక్‌పేట నుంచి రోజూ ఆఫీసుకి వెళ్ళి రావడం కష్టంగా వుంది."

"అవునులే, ఆఫీసుకి కొంచెం దగ్గరగా వుంటే బాగుంటుంది. మరి అశోక్‌కి కాలేజీ అదీ సౌకర్యంగా వుంటుందా?"

"అశోక్ పీహెచ్‌డీ అయిపోయింది కదమ్మా! ఇంక ఇప్పుడూ కాలేజీకి వెళ్ళి వొస్తే చాలు. అత్తయ్య గారూ ఎటూ రిటైర్ అవుతున్నారు. అమ్ముకి బాంకు కూడా పెద్ద దూరం కాదు."

"వాళ్ళెందుకు నాన్నా మీతో? వాళ్ళది మలక్‌పేటలొ సొంతిల్లేగా? అక్కడే వుండనీ. కాస్త మీరిద్దరూ కొన్నాళ్ళు సరదాగా వొంటరిగా వుండండి."

"అలా కుదరదమ్మా! అత్తయ్యగారు ఒంటరిగా వుండలేరు. అయినా, అమ్మూ పెళ్ళి కూడా నిశ్చయమైనట్టే, ఒకటి రెండేళ్ళలో ఆ పెళ్ళి కూడా చేసేస్తే, ఇక మేం ఫ్రీ!"

"ఎంత ఆరిందా వయ్యావే? కొంచెం డబ్బులవీ చూసి ఖర్చు పెట్టుకో! రేపు మీకు పిల్లా జెల్లా పుడితే!"

"అమ్మా! అవన్నీ నీకెందుకే? మేమేదో చేసుకుంటాం. అది సరే కానీ, నాన్న ఏం చేస్తున్నారు?"

"నువ్వు లేక బోరు కొడుతోందని తెగ గోల పెడుతున్నారు."

"అవునా? అయితే పై శనివారం లంచి కొచ్చేస్తారా?

"అశోక్, మీ అత్తయ్యగారూ ఏమైనా అనుకుంటారేమో!"

"వాళ్ళెందుకనుకుంటారమ్మా? పన్నెండింటికి నువ్వూ నాన్నా వచ్చేయండి."

★★★★★★★★★★★★★★★★★★★★★

"అత్తయ్యా! వచ్చే శనివారం మా అమ్మా నాన్నా మధ్యాహ్నం భోజనానికొస్తున్నారు. నేనే పిలిచాను."

"మంచి పని చేసావ్ భానూ! నేనే అందామనుకున్నాను. పాపం వాళ్ళకీ నిన్ను చూడాలని వుంటుంది కదా!"

"కానీ, శనివారం నాకోసం కొందరు స్టూడెంట్స్ వొస్తారు భానూ!"

"ఎప్పుడు లేనిది స్టూడెంట్స్ ఇంటికి రావడం ఏంటి?" సుమిత్ర ఆశ్చర్యంగా అడిగింది.

"స్టూడెంట్స్ అంటే, కాలేజీ స్టూడెంట్స్ కాదమ్మా. ఇద్దరు అబ్బాయిలు డాన్స్ నేర్చుకుంటామని అడుగుతున్నారు. మా కొలీగ్ ఆనంద్ గారి అబ్బాయిలు.  ఐ వాంట్ టు ట్రై టీచింగ్ డాన్స్."

"సరేలే, వాళ్ళని ఆదివారం రమ్మను. వొదిన వాళ్ళ అమ్మా నాన్నా శనివారం వొస్తారు. అంతే, ఫైనల్. వొదినా, చెప్పు, వొంట మనిద్దరం చేద్దామా, బయటినుంచి తెద్దామా?"

"మీరిద్దరా? తిందామనేనా? భానూ, నీకసలు వంటొచ్చా?" అశోక్ నవ్వాడు.

"యేం, నీకొచ్చా? నీకు రాను వంట భానుకి మాత్రం ఎలా వొస్తుంది? నేను చేస్తాలే వొంట, భానూ!" సుమిత్ర అడ్డం వొచ్చింది.

"నో, అత్తయ్యా! నేనూ, అమ్మూ, అశోక్ అందరం వొంట నేర్చుకుంటాం. మీరొక్కళ్ళే ఎందుకు చేయలి?"

ఆ రాత్రి పడుకోబోయే ముందు అడిగింది భాను.

"డాన్స్ పాఠాలేంటి అశోక్? ఎవరు నేర్చుకుంటున్నరు?"

"ఇవాళ కాలేజీలో మాటల్లో కొలీగ్ ఆనంద్ చెప్పాడు. తను యూనివర్సిటీలో నా డాన్స్ ప్రోగ్రాం చూశాడట. చాలా నచ్చిందట. తన అబ్బాయిలిద్దరికీ నేర్పిస్తావా అని అడిగాడు. అసలు నాకు డాన్సు ఏమైనా గుర్తుందో లేదో కూడా తెలియదు! దాదాపు అయిదేళ్ళకి పైనే అయింది, కానీ నాకు నేర్పించాలనే వుంది. నేర్పించనా? అందరూ నవ్వుతారా?"

"నవ్వడానికేముందిలే కానీ, చూసుకో, మరి వారమంతా కాలేజీలో పనిచేసి, దొరికే వీకెండ్ క్లాసంటే చేయగలవా?"

"చూద్దాం లే. అందులో మనం కుకట్‌పల్లి వైపు ఇల్లు కూడా మారుతున్నాం. వీలవుతుందో లేదో."

★★★★★★★★★★★★★★★★★★

"అమ్మా!", తల్లి మెడ చుట్టూ చేతులు వేసి సంతోషంగా వేళాడింది భాను. కూతురి నుదుటి మీద ముద్దు పెట్టి తెచ్చిన మిఠాయి డబ్బా చేతిలో పెట్టింది ప్రభావతి.

"హలో మామయ్యగారు! రండి, కూర్చోండి." ఆహ్వానించింది అమూల్య.

"అశోక్ యేడమ్మా?" కూర్చుంటూ అడిగడు పద్మనాభం.

"నెయ్యి అయిపోయిందంటే తేవడానికి వెళ్ళారు నాన్నా. అయిదు నిమిషాల్లో వొచ్చేస్తారు. మంచినీళ్ళు తాగుతావా?"

ప్రభావతి లేచి సుమిత్రని పలకరించడానికి లోపలికెళ్ళింది. ఎప్పుడూ గల గలా మాట్లాడుతూ, తనని దబాయిస్తూ తిరిగే కూతురు, అత్తవారింట్లో చురీదార్ వేసుకొని, జడ అల్లుకొని, చిన్న బొట్టుతో, ఆరిందలాగనిపించి ముద్దొచ్చింది పద్మనాభానికి.

"ఇలా రా నాన్నా. కాసేపు నా దగ్గర కూర్చో!"

"వొస్తున్నా, కానీ అప్పడాలు మాడిపోతాయి!" లోపలికెళ్ళింది.

భోజనాల దగ్గర అడిగాడు పద్మనాభం.

"ఇల్లు మారుతున్నారటకదా అశోక్? దొరికిందా?"

"ఒక ఇల్లు దొరికిందంకుల్. ఇప్పుడైతే అద్దెకు తీసుకుంటున్నాం. ఇక్కణ్ణించి భానుకి ఆఫీసు చాలా దూరం అవుతుంది. కూకట్‌పల్లి నుంచి తనకి ఆఫీసు బస్సు వేసారు. నా కాలేజీ సికిందరాబాదు, పరవాలేదు. అమ్మని వాలంటరీ రిటైర్మెంటు తీసుకొమ్మంటున్నా కానీ, వినటం లేదు."

"వాడి మొహం! ఇప్పణ్ణించి రిటైర్ అయి చేసేదేముంది అన్నయ్య గారు? ఇంకా ఎనిమిదేళ్ళ సర్వీసుంది. కనీసం అయిదేళ్ళైనా చేద్దామనుకుంటున్నాను." సుమిత్ర కొట్టిపడేసింది.

మధ్యాహ్నం మూడింటి దాకా కూర్చొని టీ తాగి వెళ్ళిపోయారు పద్మనాభమూ, ప్రభావతీ.

★★★★★★★★★★★★

*1997–జూలై*

"తాం ధిగి ధిగి తై, తత్తా హత్తా తై..."

హాల్లోంచి అశోక్ గొంతూ, గజ్జెల శబ్దమూ వొస్తున్నాయి. మంచం మీద అప్పుడే నిద్రలోకి జారబోతున్న భాను లేచి కూర్చుంది. ఆమె నిద్ర తేలిపోయింది.

"అబ్బా! అశోక్ క్లాసులో వున్నాడు కాబోలు. ప్రతీ ఆదివారమూ ఇంతే!" విసుక్కుంది భాను. ఆనంద్ కొడుకులిద్దరూ అశోక్ దగ్గర డాన్సు నేర్చుకుంటామని చేరారు. ఆదివారం మూడింటికొస్తారు.

మధ్యాహ్నం అన్నం తిని కాసేపు పడుకుందాం అని తను పక్క చేరుతుంది. పేపర్ అటూ ఇటూ తిరగేసి చిన్నగా నిద్రలోకి జారుతూ వుండగానే క్లాసు శబ్దాలు మొదలవుతాయి.

ఇప్పటికి నాలుగువారాలుగా ఇదే తంతు. నిట్టూర్చి లేచి టీ పెట్టడానికని లేచి వెళ్ళింది.

★★★★★★★

"సినిమాకెళ్దామా, భానూ?"

"సినిమాకా?ఇప్పుడా? ఆరవుతోంది. రేపు సోమవారం అశోక్. పొద్దున్నే లేచి ఆఫీసుకెళ్ళాలి. వచ్చే శనివారం వెళ్దాం."

"అబ్బ, తొమ్మిదింటికల్లా వొచ్చేస్తాం కదా. "హిట్లర్" , చిరంజీవి సినిమా, చూద్దాం పద. ! కోణార్క థియేటర్ కెళ్దాం దగ్గరే కదా?"

"రాత్రిపూట నలుగురికీ ఆటో దొరకడం కష్టం కాదా?"

"ఇద్దరమే వెళ్దాం. బైక్ మీద వెళ్ళి వొచ్చేయొచ్చు".

"ఇద్దరమేనా? అత్తయ్య, అమ్మూ ఏమైనా అనుకుంటారేమో అశోక్!"

"అబ్బ, యేమనుకోరులే. నేను చెప్తా, నువ్వు రెడీ అవు."

అశోక్ బయటికెళ్ళాడు.

"అమ్మా, నేనూ భానూ సినిమాకెళ్తున్నాం. నువ్వూ అమ్మూ అన్నాలు తినేయండి. ఇంటికొచ్చి మేం పెట్టుకొని తింటాంలే."

"సరే, నాన్నా! జాగ్రత్తగా వెళ్ళి రండి".

వాళ్ళిద్దరినీ బయటికి పంపి తలుపేసుకుంది సుమిత్ర.

★★★★★★★★★★★★

"అశోక్! నువ్వు కొంచెం క్లాసులు శనివారానికి మార్చుకోలేవా?"

"ఎందుకు? ఆదివారం మధ్యాహ్నం క్లాసులు బానే వున్నాయిగా?"

"నీకు బాగున్నాయి! నాకే బాలేదు. సరిగ్గా నేను కొంచెం సేపు పడుకుందామనుకుంటాను. కొంచెం కన్నంటుకోగానే, మీ క్లాసుల శబ్దం. నాకొచ్చేది ఆ ఒక్క ఆదివారం మధ్యాహ్నమే!"

"అబ్బ, నువ్వే శనివారం మధ్యాహ్నం పడుకో భానూ! ఆ పిల్లలకి ఆదివారం తప్ప ఇంకెప్పుడూ కుదరదంటున్నారు."

"శనివారం మధ్యాహ్నం నేను బాడ్మింటన్ ప్రాక్టీసుకెళ్తున్నాను కదా?" చిరాగ్గా అంది భాను.

"నువ్వు ప్రాక్టీసు టైం మార్చుకో భానూ!"

"సరే, చూస్తాలే. అన్నట్టు నాకు సాలరీ పెరిగింది అశోక్. ఇప్పుడు నెలకి పదిహేను వేలు."

"అవునా? సూపర్. డబ్బున్న దానివైపోతున్నావన్న మాట."

"పదిహేనువేలకా? నా బాచిలో చదువుకున్న కంప్యుటర్ సైన్సెస్ స్నేహితులు నెలకి పాతిక నుంచి ముప్పై వేల దాకా జీతాలు తీసుకుంటాన్నారు."

"అబ్బా, పోనీలే భానూ. నీ వుద్యోగం నీకు బాగుంది కదా, అంతే చాలు. అందరమూ కంప్యూటర్ల మీద వేళ్ళు టకటకలాడించక్కరలేదు. వేరే వుద్యోగాలు కూడా చేసుకోవచ్చు. అది సరే కానీ, మరి వొచ్చే ఎక్స్ట్రా డబ్బంతా ఏం చేస్తారు మేడం?"

"నా జీతం అంతా దాచిపెడతాను. అమ్మూ జీతం తన పెళ్ళికని దాచిపెడదాం. అత్తయ్య జీతం ఆవిడకే వుండనీ. నీ జీతంతో ఇల్లు నడుపుకుందాం. నా జీతం దాచుకొని రెండేళ్ళలో ఒక చిన్న ప్లాటు కొందాం. మా ఫాక్టరీ మాకు లోన్ ఇస్తుంది. తీసుకొని చిన్న ఇల్లు కట్టుకుందాం. ముప్పై యేళ్ళు వొచ్చేసరికి మనకి ఒక చిన్న బుజ్జి ఇల్లు!"

భాను కళ్ళలోకి ప్రేమగా చూసి నవ్వాడు అశోక్!

"అబ్బో, ఎంత ఫైనాన్షియల్ ప్లానింగ్! ఒక్కసారిగా పెద్దైపోయామా!"

"అప్పుడే ఎక్కడ. ఇంకా చాలా పెద్దవాల్సి వుంది. వొచ్చే నెల నీకు ఇరవై యేడు, నాకు ఇరవై ఆరు!"

"మా అమ్మకి ఈ వయసుకి నేనూ, అమ్మూ ఇద్దరం పుట్టేసామట. అంటూ వుంటుంది."

"వామ్మో! నాకసలు పిల్లలని తలచుకుంటేనే దడ పుడుతుంది.  ఇంకొక్క ఆరు నెలలు ఆగి అప్పుడాలోచిద్దాం."

"ఇప్పుడు నేనసలు పిల్లల గురించి మాట్లాడానా? నువ్వే అనవసరంగా ఆ టాపిక్ యెత్తి హైరానా పడుతున్నావు!"

"అవునులే. అది సరే, ఆగస్టులో పుట్టినరోజుకీ, నీ గ్రాద్యుయేషన్‌కీ కలిపి ఒక కొత్త చీర కొనుక్కుంటా."

"ఒక్కటెందుకు? రెండు కొనుక్కో!"

"అవునులే, అదీ మంచి అయిడియా. నాలుగువేలు పెట్టి ఒక్క చీర కొనేకంటే, రెండు వేల పెట్టి రెండు చీరలు కొనుక్కుంటా."

"అమ్మో! అమ్మో! నిజంగా నువ్వు ఫైనాన్షియల్ జీనియస్ అమ్మాయ్!"

"ఓ యబ్బో! చాల్లే వేళాకోళం. నేను పడుకుంటున్నా. రేపు పొద్దున్నే లేవాలి. ఆఫీసుంది.

### *1997– డిసెంబర్*

"హేపీ వెడింగ్ ఏనివర్సరీ భానూ! ”

వెనకనించి భానుని చుట్టేస్తూ అన్నాడు అశోక్.

అతని చేతులు విడిపించుకుంటూ నవ్వింది భాను.

"థేంక్ యూ! అశోక్. ఇవాళ లీవు పెట్టాను. ఇద్దరం ఎటైనా వెళ్దామా?"

"సాయంత్రం సూసీ, శివా, ఆశా, శరత్, కోమలీ, వెంకట్ మనింటికొస్తామన్నారు. ఎక్కడికెళ్ళినా సాయంత్రానికల్లా వొచ్చేద్దాం."

"అవునా? సూసీ వాళ్ళు వొచ్చినట్టు తెలుసు కానీ, ఇవాళ ఇక్కడికొస్తున్నట్టు తెలియదు. సరే, తొందరగానే వొచ్చేద్దాం. మా అమ్మా వాళ్ళింటికెళ్ళి వొద్దాం."

"అక్కడ కొంచెం సేపుండి మనిద్దరం సినిమాకెళ్దాం."

★★★★★★★★★★★★

"భానూ!" స్నేహితులందరూ ప్రేమగా హత్తుకున్నారు భానుని.

"సూసీ! కోమలీ! ఎంత దుర్మార్గులే మీరిద్దరూ. సూసీ, నీకైతే నీ పెళ్ళి మేం చేసామన్న కృతజ్ఞత కూడా లేకపోయిందే ద్రోహి. మా పెళ్ళికి కూడా రాలేదు."

“హల్లో డాక్టర్ అశోక్! మీ ఆవిడ భలే కోపిష్టి సుమా!"

అందరూ నవ్వారు. ముద్దులు మూటకడుతున్న ఆశా కూతురుని చూసి అందరూ ముచ్చటపడ్డారు.

"అశోక్! అరుంధతీ రాయ్ గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్ చదివావా? బుకర్ ప్రైజ్ వొచ్చిందటగా?"

"లేదు శివా! ఈ మధ్య కొంచెం చదవడం తగ్గింది."

"కాలేజీలో ఇంగ్లీషు లెక్చరర్ అనవల్సిన మాటలేనా అవి?"

రాత్రంతా ఎన్నో కబుర్లు చెప్పుకుంటూ గడిపారు. ఇండియాలో ప్రభుత్వాల మార్పిడీ, బ్రిటిష్ రాజకుమారి డయానా మరణమూ, అరుంధతీ రాయ్ బుకర్ ప్రైజ్ గెలుపూ, దిగజారుతున్న సినిమాలూ, ఏదీ వొదలలేదు.

★★★★★★★★★★★★★★★★★★★★★★★★

"అశోక్! హల్లో!"

"భానూ, ఏమిటీ టైములో ఫోను? అదీ కాలేజీకి. అంతా ఓకేనా?"

" అంతా ఓకేనే. ఒక గుడ్ న్యూస్ చెప్దామని."

"అవునా? ఏంటది? చెప్పు, చెప్పు!"

"నన్ను మా ఫాక్టరీ నుంచి ఒక ట్రైనింగు కోసమని జర్మనీ పంపుతున్నారు, రెండు నెలలు."

"రెండు నెలలా? ఎప్పుడు?"

"బహూశా వచ్చే నెల."

"కంగ్రాట్స్ భాను. ప్రౌడ్ ఆఫ్ యూ! నిన్నొదిలి రెండు నెలలుండగలనా? అయినా, నువ్వు గుడ్ న్యూస్ అంటే నేనింకేదో అనుకున్నాను."

"చాల్చాల్లే! ఇంటికొచ్చాక మాట్లాడతా. నీకోసం గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్ పుస్తకం కొన్నా. నీకు తెలుసో తెలియదో, ఆ పుస్తకానికి ఈ సంవత్సరం బుకర్ ప్రైజు వచ్చిందట. ఇంగ్లీషు లెక్చరరువి, ఆ మాత్రం చదవాలి. సాయంత్రం ఇస్తా!"

నవ్వింది భాను.

★★★★★★★★★★★★★★

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS